# తొమ్మిదేండ్లలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా



ప్రచారంలో భాగంగా బిగాలను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

- బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా
- పలు డివిజన్లలో ఎన్నికల ప్రచారం

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్లలో నిజామాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని 44, 46, 47 డివిజన్ల (పోచమ్మగల్లీ, ముదిరాజ్‌గల్లీ, వీక్లీ మార్కెట్, పూసలగల్లీ, ఉప్పర్ టెక్డీ, పూలాంగ్)లో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఆయా డివిజన్లలో బిగాలకు మహిళలు, నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ.. నగరంలో ప్రధాన రోడ్లను విశాలంగా మార్చామని, అంతర్గత రోడ్లను మెరుగుపరిచామని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మినీ ట్యాంక్ బండ్, ఎల్లమ్మగుట్ట వద్ద ఆర్‌యూబీ నిర్మించామని వివరించారు. నగరంలో 25 కిలోమీటర్ల సెంటర్ మీడియన్ నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, 44వ డివిజన కార్పొరేటర్ బైఖాన్ సుధ, మధు, రాజేంద్రప్రసాద్, కొండపాక జ్యోతీ రాజేశ్, నీలగిరి రాజు, కార్పొరేటర్లు అక్బర్ హుస్సేన్, బద్దూరి మృదుల, నాయకులు గుంచెట్టి అరుణ్, భూపతి పాల్గొన్నారు.

## 14.5 కిలోల గంజాయి పట్టివేత

### సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో స్వాధీనం

నిజామాబాద్ క్రైం, నవంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేయకుండా ఎక్సైజ్, రైల్వేపోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ టీమ్, పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. రైళ్లలో గంజాయిని తరలించకుండా స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నారు. నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతోపాటు రైల్వేపోలీస్, ఆర్‌పీఎఫ్ బృందాలు నిజామాబాద్ వద్ద సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో శనివారం తనిఖీ చేశారు. ఓ బోగీలో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో 14.5 కేజీల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3.62 లక్షలు ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆదేశాల మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలో సీఐ వెంకటేశ్, రైల్వే ఎస్సై తావునాయక్, ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎన్స్‌ఫోర్స్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి, కానిస్టేబుల్స్ విష్ణు, మంజుల, ఆర్‌పీఎఫ్, జీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.




స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

# ఓటర్లను ప్రలోభాలకు గురిచేకుండా నిఘాపెట్టాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు
- నోడల్ అధికారులతో భేటీ



సమావేశమైన ఎన్నికల వ్యయ పరిశీలకులు, నోడల్ అధికారులు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 4 : ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టకుండా అన్ని ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు నోడల్ అధికారులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు శక్తి మాట్లాడుతూ.. పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందు మద్యం, డబ్బుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాంకులు, యూపీఐ ద్వారా నిర్వహించే నగదు చెల్లింపులను నిశితంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

జిల్లాలో ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు చేపట్టిన చర్యలపై పరిశీలకులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయని, వాటిలో బాన్సువాడ సెగ్మెంట్ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో కూడుకొని ఉన్నదని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.శక్తి, తాన్యాసింగ్, పాటిల్ చిన్మయ్ ప్రభాకర్ దృష్టికి తెచ్చారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మానాల రెవెన్యూ గ్రామం జాబితాలో కొనసాగుతున్న నాలుగు పోలింగ్ కేంద్రాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి వస్తాయని తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 36 మండలాలున్నాయని, 1549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు, ఆయా పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారని, నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని బృందాలను నియమిస్తామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు రూ.83,84,173 విలువ చేసే అక్రమ మద్యం నిల్వలను గుర్తించి సీజ్ చేశారని వెల్లడించారు.

ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు సోదాలు చేస్తూ అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్నాయన్నారు. ఎన్నికల నిబంధన ఉల్లంఘన ఫిర్యాదులను స్వీకరించేందుకు కంట్రోల్ రూమ్‌తోపాటు సీ విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

సరిహద్దు జిల్లా నుంచి నిజామాబాద్‌లోని అక్రమంగా డబ్బు, మద్యం, మత్తుపదార్థాలను తరలించకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని వివరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్, కంట్రోల్ రూములను ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. వారి వెంట సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నోడల్ అధికారులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రచారం చేశారు. నగరంలోని అన్ని డివిజన్లలో కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, బిగాల నాయకత్వంలో జరిగిన అభివృద్ధిపై కరపత్రాలు పంచుతూ వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి, బిగాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును డిపో-2 నుంచి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సర్వీస్ నంబర్ 9660 బస్సు ఈనెల 25న రాత్రి 8 గంటలకు నిజామాబాద్ నుంచి బయల్దేరి 26న ఉదయం 11 గంటలకు కాణిపాకం చేరుకుంటుందని తెలిపారు. విఘ్నేశ్వరుని దర్శనానంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు వేలూర్ గోల్డెన్ ఆలయం చేరుకుంటుందని, దర్శనానంతరం సాయంత్రం 6.30 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం 27న తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరి, 28న ఉదయం 3 గంటలకు జోగుళాంబ ఆలయానికి చేరుకుంటుందని, అక్కడినుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి 28న సాయంత్రం 7.30 గంటలకు నిజామాబాద్ చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ.4,200, పిల్లలకు రూ.3,400 చార్జి ఉంటుందని, ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్లను రిజర్వేషన్ కౌంటర్లలో లేదా www.tsrtconline.in ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డిపో మేనేజర్ 9959226017, 7382844366, 7382846084 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## 10న ధన త్రయోదశి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 4 : దీపావళి పండుగకు ముందు జరుపుకొనే ధనత్రయోదశిని ఈనెల 10వ తేదీన శుక్రవారం జరుపుకోవాలని ప్రముఖ పంచాంగ కర్త రాజుశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న నరక చతుర్దశి, 12న దీపావళి, ధనలక్ష్మీ పూజలు, 13న గోవర్ధన పూజ, 14న భాయ్‌దూజ్ వేడుకలను జరుపుకోవాలని తెలిపారు. ఆదివారం లక్ష్మీపూజలను వ్యాపార సంస్థల్లో, గృహాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.10 గంటల వరకు, రాత్రి 7.10 నుంచి రాత్రి 11 గంటల వరకు జరుపుకోవాలని సూచించారు.

## 13న దత్త విజయానంద తీర్థస్వామి రాక

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 4 : నగరంలోని గంగస్థాన్ ఫేస్ -2లో ఉన్న ఉత్తర తిరుపతిక్షేత్రానికి ఈ నెల 13వ తేదీన దత్త విజయానంద తీర్థస్వామి రానున్నట్లు గణపతి సచ్చిదానంద ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు సంపత్ శనివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. 13న సాయంత్రం 6 గంటలకు స్వామిజీ అనుగ్రహ భాషణం, 14న ఉదయం 9 గంటలకు గోపూజ, గణపతి హోమం, పూర్ణాహుతి, శ్రీచక్రపూజ, సాయంత్రం 6గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 8 గంటలకు లక్ష దీపోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



**హైదరాబాద్‌లోని** జలవిహార్‌లో రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంతో న్యాయవాదులు చేసిన పోరాటాన్ని కొనియాడారని, న్యాయవాదుల సంక్షేమానికి వంద కోట్లు కేటాయించినట్లు కేటీఆర్ వివరించారని బీఆర్ఎస్ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్‌రావు, అమృత్‌రావు వైద్య తెలిపారు. సమ్మేళనంలో జిల్లా నుంచి న్యాయవాదులు రాజలింగం, ఈగ గంగారెడ్డి, ఎన్ఎల్. శాస్త్రి, కర్తన్ గణేశ్, శ్రీధర్, పులి జైపాల్, మధు, గణేశ్ పాల్గొన్నారు.

– నిజామాబాద్ లీగల్, నవంబర్ 4